**49**

**ధారావాహిక**

**జరిగిన కథ :** పిష్టపుర యుద్ధవిజయం రాజ్యమంతా పండుగశోభను తెచ్చినా.. చక్రవర్తి మాత్రం విచారవీచికలతో కనిపిస్తు న్నాడు. కారణం.. తనకు పినచోడుడు, జాయపుడు మహోపకారం చేస్తే, ఆ కుటుంబానికి తాను అపకారం చేసినట్లు ఆయన భావించడం. అయితే, పినచోడుని కుటుంబానికీ ఉపకారం చేసేలా.. బందీలుగా తెచ్చిన జంట పిల్లలను వివాహం చేసుకోమంటూ చక్రవర్తికి సలహా ఇచ్చాడు రుద్రసేనాని. స్థిర నిర్ణయుడయ్యాడు గణపతిదేవుడు.



# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల


మత్తి భానుమూర్తి

99893 71284


పినచోడుని కుటుంబాన్ని, తన శ్రేయోభిలాషులైన కాకతీయ మహామహులను ఉద్దేశించి మాట్లాడటం ప్రారంభించాడు చక్రవర్తి. ''పినచోడుని కుటుంబానికి దారుణమైన అన్యాయం జరిగినట్లు మేము అంగీకరిస్తున్నాం. ఆ అన్యాయానికి ఇదే సరైన ప్రాయశ్చిత్తం అనుకుంటే.. ఆ ప్రాయశ్చిత్తాన్ని ఇప్పుడే ప్రకటిస్తున్నాం. మీరు చెప్పినట్లు పినచోడుని కుమార్తెలను మేమే వివాహం చేసుకుంటాం. అది మా తప్పులకు ప్రాయశ్చిత్తమని మీరు నమ్ముతున్నారు. మరి వారు నమ్ముతారా?'' అన్నాడు.

పినచోడుని కుటుంబం తక్షణం ఒక్కటైంది. తమ్ముళ్లు, కుమారుడు జాయప.. బాయమ్మ మంచం వద్దకు వచ్చారు. పినచోడునితో చేతులు కలిపారు.

''మాకు అంతకంటే అదృష్టం ఏం కావాలి ప్రభూ! మా కుటుంబచరిత్ర అంతా పవిత్రమైపోతుంది. మేము నిండు హృదయాలతో మీ నిర్ణయాన్ని శిరస్సు వంచి ఆహ్వానిస్తున్నాం!''.. అన్నాడు పినచోడుడు.

మందిరమంతా చప్పట్లతో మారుమోగింది.

ఉద్విగ్నత తగ్గి ఉత్తేజం పెరిగి అందరూ ప్రఫుల్ల మనస్కులయ్యారు.

* * *

మరో పక్షంరోజుల తర్వాత..

తలగడదీవి కోట ముఖద్వారం!

మంగళవాద్యాలు అద్భుతంగా మోగుతున్నాయి. ఓ పెద్ద పటాలం ఊరేగింపుగా దగ్గరికి వస్తున్నది. అయ్య రాజవంశపు ముఖ్యులంతా అమందానంద కందళిత హృదయారవిందులై.. విప్పారిన కళ్లతో చూస్తున్నారు. మొదటగా బంగారురంగు పల్లకీ దగ్గరకొచ్చింది. దాని నుంచి కుడికాలు కింద పెట్టింది నారాంబ, వెనుక పేరాంబ. యుద్ధ ఖైదీలుగా తలగడదీవి వదిలిన కూతుళ్లు.. అనుమకొండకే మహారాణులుగా నిశ్చయమై, వివాహ వేడుకకై పుట్టిల్లు తలగడదీవికి తిరిగి వచ్చారు. ఆ పుట్టిల్లు పులకించదా మరి!!

తూర్పు సముద్రపు ఉత్తుంగ కెరటాలే ఘోష వాద్యగా.. కృష్ణా నదీమతల్లి ఆహ్వానగీతికలు పాడుతుండగా వారిని సగౌరవంగా మేళతాళాల మధ్య కోటలోకి తోడ్కొని పోయిందా బంధువుల బృందం. ఆ బృందానికి నాయకత్వం వహించింది.. పోరాట కౌమారుడు.. అయ్య వంశజుడు.. నూనూగు మీసాల జాయప!

* * *

అయ్యవంశంతో వియ్యమందడానికి చక్రవర్తి గణపతిదేవుడు ముందుకు రావడం పినచోడుని కుటుంబాన్ని సంతోష దిగ్భ్రమలో ముంచెత్తింది. క్షణం ఆలస్యం చెయ్యలేదు పినచోడుడు. ముందు రుద్రసేనానిని కలిశాడు. సాష్టాంగ ప్రణామాలు ఆచరించాడు.

''అన్ని గౌరవాలకు నువ్వు అర్హుడివి పినచోడా! గణపతిదేవుడు కేవలం మహామండలేశ్వరుడు మాత్రమే కాదు. జాతి రత్నం. మహామనిషి. దైవాంశ సంభూ